క్లుప్తంగా

ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ 2024 పరీక్ష ఫలితాల్లో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలోనే మెరుగైన ఫలితాలు సాధించి ఐదో స్థానంలో నిలబడిందని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శి చెప్పలి రాజారావు అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫలితాల పరంగా ఇదివరకు వైఎస్సార్‌జిల్లా చివరిస్థానంలో ఉండేదన్నారు. ఈసారి 22వ స్థానంలో నిలబడేలా చేసిన ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య, అధ్యాపకుల కృషి అభినందనీయమన్నారు. ఫలితాల ఫరంగా భవిష్యత్తులో వైఎస్సార్ జిల్లాను ప్రథమస్థానంలో నిలబెట్టేందుకు మరింతట కృషి చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం


నవ్యశ్రీ

కడప ఎడ్యుకేషన్ : కడప జేఎంజే జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి నవ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచి భళా అనిపించారు. ప్రిన్సిపాల్ రాణి మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో నవ్యశ్రీ 470 మార్కులకుగానూ 464 మార్కులు సాధించిందని తెలిపారు. ఫలితాల పరంగా తమ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచిందన్నారు.

శ్రీచైతన్య అకాడమి విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కడప శ్రీ చైతన్య అకాడమీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సీనియర్ బైపీసీలో నఫీసా ఖానం 989, రిషిత 983, ఎంపీసీ విభాగంలో విదిష 986, మహతాజ్ 982, సాబిరీ 981, ఎంఈసీలో శ్వేత 968, ఈసీఈలో విజయదుర్గ 955 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. జూనియర్ ఎంపీసీలో అనూష, విష్ణు లోహిత, నందినిలు 462, రబియాబేగం, వెంకటసాయి 460, బైపీసీలో ఆయేషా ఆఫ్మాన్, సబాలు 433, ఆమీనా 430, ఎంఈసీలో డింపుల్ కుమారి 464, అలీషా సుల్తానా 461, సీఈసీలో సమీర 481, అంజుమ్ 480 మార్కులను సాధించి టాపర్స్‌గా నిలిచారు. కరస్పాండెంట్ మల్లికార్జున, డైరెక్టర్ రామచంద్రనాయుడు, ప్రిన్సిపల్ రమేష్ విద్యార్థులను అభినందించారు.

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన


సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు

వైవీయూ : కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. చెన్నైకు చెందిన ఎం.ఆర్.వి.టెక్నాలజీస్ ఆధ్వర్యంలోని లోకేష్ ఇన్ఫోటెక్ సహకారంతో నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్‌లో రాత పరీక్ష, సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 72 మంది విద్యార్థులను బెంగళూరు, చెన్నై కేంద్రాలుగా ఉన్న కంపెనీల్లో ఉద్యోగాలకు రూ.2.50 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసినట్లు వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డి.మనోహర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. ఎంపికల ప్రక్రియను ఎంఆర్‌వి టెక్నాలజీస్ మేనేజర్ నాగేంద్ర, లోకేష్, తదితరులు పర్యవేక్షించారు.

నేడు ఇంటింటా ప్రచారం

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె, యరమలపల్లె, పోచరంరెడ్డిపల్లె గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సాయినాథ్ శర్మ ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు బుసిరెడ్డిపల్లె, మధ్యాహ్నం 2 గంటలకు పోచంరెడ్డిపల్లె, 4 గంటలకు యరమలపల్లె గ్రామాల్లో ప్రచారం ఉంటుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి హనుమ సమేత సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ విగ్రహ ప్రతిష్టలో పాల్గొని పూజలు చేశారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్‌బాబు


సమావేశానికి హాజరైన దైవ సేవకులు

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కోరారు. స్థానిక సీఎస్ఐ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పెనుబాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కడప సిటీ స్వతంత్ర క్రైస్తవ దైవ సేవకుల ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్ఐ, ఆర్‌సీఎం ఇతర పెద్ద చర్చిలకు నిధులు వస్తుంటాయని, స్వతంత్రంగా చర్చిలు నడిపే పాస్టర్లకు ఏ ఆధారం ఉండదన్నారు. ఈ విషయాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్చి ఫాస్టర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల జగనన్న పాలనలో దైవ సేవకులకు తాము అండగా ఉన్నామని, చర్చిల నిర్మాణానికి, ప్రహరీ గోడలు నిర్మించేందుకు కృషి చేశామని వివరించారు. సెంట్రల్ జైలు సమీపంలో రూ.6 కోట్లలో హిందూ, ముస్లిం, క్రిష్టియన్ల శ్మశానవాటికలు మోడల్‌గా నిర్మించామని గుర్తు చేశారు. కడప నగరంలో రహదారులను విస్తరించి, కూడళ్లను అందంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. జిల్లా ముద్దు బిడ్డ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన ఒక్కడిపై అన్ని పార్టీలు ఏకమై కలిసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. ఇందులో షర్మిల, సునీత పావులుగా మారారన్నారు. సీబీఐ కేసు విచారణలో ఉండగా వారు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని హంతకుడని మాట్లాడటం దారుణమన్నారు. కోట్లాది మంది అక్కా చెల్లెళ్లకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వంత చెల్లెళ్లకు కీడు చేస్తాడా.. ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. పాస్టర్ల మాట ప్రజలు వింటారని, వారు వాస్తవాలు వివరించి వారిని చైతన్యం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పెనుబాల విజయ్ కుమార్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే త్రిమూర్తులు అవినాష్‌రెడ్డి, సురేష్ బాబు, అంజద్ బాషా అని తెలిపారు. రానున్న జగనన్న పాలనలో పాస్టర్ల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ స్కూల్ కరస్పాండెంట్ మనోహర్, డేనియల్, జై సింహా, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్షద్ బాషా, పి. జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, విజయ్ కిషోర్, దేవిరెడ్డి ఆదిత్య, కె. బాబు, రామ్మోహన్‌రెడ్డి, షఫీవుల్లా, షఫీ, శ్యాంసన్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చైత్రమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

17న నగరంలో శ్రీరామ నవమి వేడుకలు

కడప కల్చరల్ : కడప నగరంలో ఈ నెల 17వ తేదీన శ్రీరామ నవమి వేడుకలను ఆలయాలు సిద్ధమయ్యాయి. మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో 17న ఉదయం 9.30 గంటలకు సీతారామ చంద్రుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ అన్నప్రసాదం ఏర్పాటుచేయనున్నారు. 18న సాయంత్రం 7 గంటలకు సీతారాముల మహా పట్టాభిషేకం, 19న పుష్పయాగం నిర్వహిస్తారు. 17న రిమ్స్‌వద్ద గల ఇందిరానగర్‌లోని భద్రాద్రి సీతారామ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 5 గంటలకు గణపతిపూజ, కలశ స్థాపన, పంచామృతాభిషేకం తదితర పూజలను శ్రీ భద్రాద్రి రామాలయం ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి పంపా క్షేత్ర స్వర్ణ హంపి వేద వ్యాస పీఠానికి చెందిన గోవిందనానంద సరస్వతీస్వామి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా 18న ఉదయం 10.30 నుంచి సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6.30 నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. స్థానిక మారుతీనగర్‌లోని సీతారామ స్వామి ఆలయంలో 17న ఉదయం 11 గంటల నుంచి సీతారామ చంద్రులకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి రథోత్సవం చేపట్టనున్నారు. కో ఆపరేటివ్ కాలనీలోని షిరిడి సాయిబాబా మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సంధ్యా హారతి, ఉయ్యాల సేవ, జెండా, చందనోత్సవాలు, చంద్రన ప్రసాదాల పంపిణీ ఉంటాయి. సింహపురి కాలనీలోని శ్రీ సీతా రాముల ఆలయంలో ఉదయం 9.30 నుంచి సీతా రాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

కడప కార్పొరేషన్ : డా.బీఆర్.అంబేడ్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో పేదలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమైర్, రామ్మోహన్‌రెడ్డి దుప్పట్లు శనివారం పంపిణీ చేశారు. రక్షణ సంస్థ, జైభీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను ప్రపంచ దేశాలు మెచ్చాయని, ఆయన అందించిన రాజ్యాంగం ద్వారానే ప్రజలు ప్రాథమిక హక్కులు పొందుతూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రక్షణ సంస్థ అధ్యక్షుడు పి.సంపత్, నాయకురాలు చైతల్య పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో నూతనంగా జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా శనివారం వేదపండితులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. తుమ్మలపల్లెలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన ఆలయ నిర్మాణంతో పాటు గురువారం నుంచి వేద పండితులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ హనుమ సమేత విగ్రహ ప్రతిష్ట, ధ్వజారోహణం, కలశస్థాపన తదితర కార్యక్రమాలను అంగ రంగ వైభవంగా నిర్వహించారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం: మాచుపల్లె, టక్కోలి బండికనుమ, సిద్దవటం గ్రామాల్లో శనివారం ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వాహనాల్లో అక్రమంగా మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు, తరలిస్తున్న వాటిని అరికట్టేందుకు తనిఖీ చేపట్టామన్నారు.

అట్టహాసంగా అంజద్‌బాషా ఎన్నికల ప్రచారం


కడప దర్గాలో చాదర్ సమర్పించేందుకు వెళ్తున్న అంజద్ బాషా

- పెద్దదర్గాలో ప్రార్థనలు, దేవుని కడపలో ప్రత్యేక పూజలు
- వైఎస్సార్ కాలనీలో ప్రార్థనలు నిర్వహించిన పాస్టర్లు
- ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా తన ఎన్నికల ప్రచారాన్ని శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం తన ఇంటి నుంచి బయలుదేరిన అంజద్‌బాషాకు పార్టీ మహిళా కార్యకర్తలు, కుటుంబ సభ్యులు హారతులు పట్టారు. గుమ్మడికాయతో దిష్టితీశారు.ఆ తర్వాత పెద్దదర్గాలో తన సోదరుడు ఎస్‌బి అహ్మద్‌బాషా, అల్లుడు ఉమైర్‌తో కలిసి గురువుల మజార్లకు పూల చాదర్లు సమర్పించి అంజద్ బాషా ప్రార్థనలు చేశారు. అనంతరం దేవుని కడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె సురేష్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అటునుంచి వైఎస్సార్ కాలనీకి చేరుకున్న ఆయనకు, మేయర్ సురేష్ బాబులకు 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, రైతు విభాగం నగర అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. స్థానికులు బాణాసంచా కాల్చి, పూలు చల్లుతూ, డప్పు వాయిద్యాల నడుమ ఆహ్వానం పలికి, గజమాలతో ఘనంగా సత్కరించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం రెండు పర్యాయాలుగా కలిసివస్తున్న రెండో డివిజన్ వైఎస్సార్ కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల ప్రచారంలో పెద్ద ఎత్తున పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంత్ వర్ధన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. నగరంలోని పాత బస్టాండు, బాదుల్లాసాహెబ్ మకాన్ వీధిలోని అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారం, బాలామృతం, టేక్ హోం రేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పిల్లల బరువు చూడాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వ్యాధి నిరోధక టీకాల్లో భాగంగా వ్యాక్సిన్లను జాగ్రత్తగా పరిశీలించి వేయాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను అవసరమైన సమయంలో పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత, అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు షంషాద్‌బేగం, లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు సర్వేశ్వర్, సుబ్బరాయుడు, శిక్షణా వైద్యులు నవీద్, ప్రశాంత్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పీఓ, ఏపీఓలదే కీలకపాత్ర

బద్వేలు అర్బన్ : ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓలదే కీలకపాత్ర అని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు చెందిన పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంల, వీవీప్యాట్‌ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని, అందరి విధులపైన పీఓలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పొరపాట్లకు, తప్పులకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా కూడా తమ వ్యక్తిగత అభిప్రాయాలను ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు.

మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో


పోలింగ్ కేంద్రం లోపల సుందరంగా తీర్చిదిద్దిన అధికారులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీఓలు, ఏపీఓలకు పోలింగ్ కేంద్రంపై అవగాహన కల్పించేందుకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని 162వ పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం అదరహో అనిపిస్తోంది. పోలింగ్ కేంద్రాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే మార్గాన్ని రంగురంగుల బెలూన్లతో అలంకరించారు. పోలింగ్ కేంద్రం లోపల కూడా గ్రీన్ కార్పెట్ పరిచి బెలూన్లతో అలంకరించారు. పోలింగ్ కేంద్రంలో ఒక పక్క రెండు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లు ఏర్పాటు చేశారు. పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది కూర్చునేందుకు ఒక పక్క, ఎన్నికల ఏజెంట్లు కూర్చునేందుకు ఒక పక్క కుర్చీలను వేరువేరుగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అదరహో అనేలా తీర్చిదిద్దారు.

సంక్షేమ సారధి జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి


గంగాయపల్లెలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమ పథకాల సారథిగా నిలిచిన జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఓటర్లను కోరారు. మండల పరిధిలోని గణేష్‌పురం, ఏ ఓబాయపల్లె, గంగాయపల్లె, బోరెడ్డిపల్లె గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డితో కలిసి శనివారం వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందుతాయన్నారు. గతంలో అనేక మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ అనేక అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించడానికి వస్తున్నాడని నమ్మొద్దన్నారు. అందరికీ మేలు చేసే జగన్ రెండవ సారి సీఎం అయ్యేలా పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు గుర్రంపాటి సుబ్బారెడ్డి, అమర్‌నాథరెడ్డి, నారాయణరెడ్డి, గోము సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళీరెడ్డి, బాలిరెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, చంద్రారెడ్డి, శశికుమార్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శివరామిరెడ్డి, కిషోర్ కుమార్, రమణారెడ్డి, ఓబులేసు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : అహర్నిశలు ప్రజల క్షేమం గురించి ఆలోచించే ప్రజా నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని వెల్దుర్తి ఎస్సీ కాలనీలో పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సాయినాథ శర్మతో కలసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని మహిళలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను కోరారు. రాష్ట్రంలో సంక్షేమం కుంటు పడకుండా ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడుకు ఓటు వేస్తే రాష్ట్రం అందకారంలోకి వెలుతుందని ఈ విషయాన్ని ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సర్పంచు విశ్వనాథ్, గడ్డంవారిపల్లె సహకారం సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు గంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఇంద్రారెడ్డి, రామాంజనేయరెడ్డి, గంగాధర్‌రెడ్డి, నక్కా నాగేశ్వర్‌రావు, గడ్డం దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. శనివారం తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని తిప్పిరెడ్డిపల్లె, దర్బార్‌పేట, శివ శంకరాపురం, వెంకట్రామ్‌పల్లె, పెరన్నపల్లె గ్రామాల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను 99 శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేశాడన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి సర్పంచ్ మమత, ఎంపీటీసీ లక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, నాగమల్లారెడ్డి, సుబ్బారెడ్డి, కమాల్, కమల్‌బాషా, నాగమల్లారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.


వీఎన్‌పల్లె : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సాయినాథ్ శర్మ


పెండ్లిమర్రి : తిప్పిరెడ్డిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి